క్లుప్తంగా

వైఎస్సార్‌ సీపీ సీఈసీ సభ్యునిగా కోలగట్ల



విజయనగరం: వైఎస్సార్‌ సీపీ సీఈసీ సభ్యునిగా శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

దుర్గమ్మ సేవలో ఎమ్మెల్సీ పెనుమత్స



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: నగరపంచాయతీ పరిధిలోని కొండపేటలో జరుగుతున్న దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు పాల్గొని, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గురువారం జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి, భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఆయన వెంట వైఎస్సార్‌ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబల్ల శ్రీరాములునాయుడు, కౌన్సిలర్లు పైల భారతి, మొయిద శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముని మార్గంలో పయనించాలి



గాంధీజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్మన్‌ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్‌: మహాత్మాగాంధీ పయనించిన మార్గంలో అందరూ పయనించాలని, శాంతి, అహింసలను ఆయుధాలుగా చేసుకుని దేశానికి ఆయన సాధించి పెట్టిన స్వాతంత్య్రం స్ఫూర్తిదాయకమని జెడ్పీ చైర్మన్‌ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయంలో మహాత్మాగాంధీ జయంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన స్వాతంత్య్ర సముపార్జనకు చేసిన కృషిని కొనియాడారు. బాపూజీ ఆశయ సాధన దిశగా అడుగులు వేయాలని, ఆయన చూపిన బాటలో నడవాలని కోరారు.

భూముల రీసర్వే ప్రారంభం

పూసపాటిరేగ: మండలంలోని కొల్లాయివలస గ్రామంలో భూముల రీసర్వేను డిప్యూటీ ఇన్‌స్పెక్టర్‌ ఆఫ్‌ సర్వే భగవాన్‌ శుక్రవారం ప్రారంభించారు. సర్వే సక్రమంగా చేయాలని, రైతుల సమక్షంలోనే సర్వే చేసి వారి భూ వివరాలు తెలియజేయాలని సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయరు గణపతిరావు, గ్రామ సర్వేయర్లు చిన్న, కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల ఆదాయం పెంచాలి

పూసపాటిరేగ: గ్రామపంచాయతీల ఆదాయం పెంచేందుకు కార్యదర్శులంతా కృషి చేయాలని ఎంపీడీవో వైఎస్‌ఆర్‌ నాయుడు కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రతి పంచాయతీలో వసూలు కావాల్సిన పన్నులను సకాలంలో వసూలు చేయాలని, అలాగే చెత్త సంపద తయారీ కేంద్రాల్లో సేంద్రియ ఎరువు తయారు చేసి, దానిని రాయితీపై రైతులకు అందించి పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు.

వైభవంగా మహాపూర్ణాహుతి

నెల్లిమర్ల రూరల్‌: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో మహాపూర్ణాహుతి కార్యక్రమం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున ప్రాతఃకాలార్చన అనంతరం యాగశాలలో పూర్ణాహుతి చేపట్టారు. ఆ తర్వాత సుదర్శన పెరుమాళ్లకు చక్రతీర్థ స్నానం చేశారు. సాయంత్రం 4 గంటలకు జమ్మి వేట కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం పుష్పయాగం జరిపించారు.

మహిళలకు ఆర్థిక భద్రత

విజయనగరం టౌన్‌: మహిళలకు ఆర్థిక భద్రత కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాస్‌ పాణి అన్నారు. స్థానిక లోయర్‌ ట్యాంక్‌బండ్‌ రోడ్డు మాన్సాస్‌ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన అఖిల భారత డ్వాక్రా బజారు, వివిధ స్టాల్స్‌ను ఆయన శుక్రవారం సందర్శించారు. అనంతరం విక్రయదారులతో మాట్లాడి వారు విక్రయానికి తెచ్చిన వస్తువుల గూర్చి అడిగి తెలుసుకున్నారు. అన్నిరకాల వస్తువులను అందరికీ ఒకేచోట అందుబాటులో తీసుకువచ్చేందుకు ఇటువంటి వేదికలు ఉపయోగపడతాయన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగాలి

నెల్లిమర్ల: ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రశాంత వాతావరణంలో జరగాలని, దీనికి అన్ని రాజకీయ పక్షాలు సహకరించాలని తహసీల్దారు కె.శ్రీకాంత్‌ కోరారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండలంలోని పోలింగ్‌ స్టేషన్లలో అవసరమైన చోట మార్పులు, చేర్పులు చేయాలని, ఎక్కడైనా ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మది నిండుగా.. పైడితల్లి పండగ!

- పైడితల్లి ఉత్సవానికి హుకుం జారీ
- నాటి పతివాడ పేట..నేటి హుకుంపేట
- గ్రామదేవతగానే ఒకప్పుడు పూజలు
- అమ్మవారి తొలిపూజ హుకుంపేటలోనే..



ప్రత్యేకాలంకరణలో పైడితల్లి



అమ్మవారి పండగ సందడి మొదలయ్యే హుకుంపేట



సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు(ఫైల్‌)

విజయనగరం టౌన్‌: విజయనగర రాజుల ఆడపడుచు పైడితల్లి..ఒకప్పుడు గ్రామ దేవత..ఇప్పుడా తల్లి అందరి దైవం. ఆ అమ్మ పండగ అందరికీ ఆనందకరం.. అమ్మవారికి తొలుత హుకుంపేటలోనే పూజలు నిర్వహించేవారు. అమ్మవారు వెలిసింది పెద్దచెరువులోనే కావడం, ఆ ప్రాంతం దట్టమైన అరణ్యంలా ఉండడంతో మొదట్లో తక్కువగానే భక్తులు వచ్చేవారు. కానీ కొన్నేళ్లు గడిచిన తర్వాత వనంగుడి వెలిసింది. అనంతరం కోట వద్ద చదురు నిర్మించి అమ్మను ప్రతిష్ఠించారు. పైడితల్లి పండగ తొలిరోజు నుంచి సిరిమాను రాక.. ఇలా చివరి ఘట్టం వరకు అంతా హుకుంపేటలోనే జరుగుతుంది. ఈ నెల 6, 7వ తేదీల్లో అమ్మవారి జాతర నేపథ్యంలో కథనం..

70 ఏళ్లకు పూర్వం నుంచి..

పురాతనమైన వీధి హుకుంపేటను ఒకప్పుడు పతివాడపేటగా పిలిచేవారు. పతివాడ అప్పలనాయుడు కలలో అమ్మవారు కనిపించడం..పతివాడపేటలో అమ్మవారున్న స్థలాన్ని అప్పలనాయుడు చెప్పడంతో పైడితల్లి పండగ అక్కడి నుంచే ప్రారంభమైంది. దాదాపు 70 ఏళ్లకు పూర్వమే పతివాడపేటలో గ్రామదేవత పైడితల్లి పండగ చాటింపు ఇంటింటికీ చేసేవారు. ఆ సమయంలోనే వీధి పెద్దలంతా మహారాజుకు తెలియకుండా చాటింపునకు హుకుం(ఆదేశాలు) జారీచేశారు. అప్పటి నుంచి పతివాడపేట కాస్త హుకుంపేటగా మారింది.

మూడు రోజుల పండగ..

సిరిమానోత్సవానికి కొన్నినెలల ముందు హుకుంపేట రామాలయంలో పెద్దలు సమావేశమై పండగ విధి, విధానాలను నిర్ణయిస్తారు. దేవదాయ శాఖకు సంబంధం లేని సమయంలో పూజారి ఇంట్లో మూడు రోజుల పండగ చేసేవారు. ప్రస్తుతం అది కాస్త నెలరోజుల పండగగా మారింది.

ఘటాలకు ప్రత్యేక పూజలు..

పైడితల్లి పండగ వస్తుందంటే..హుకుంపేట వాసులకు పండగే. పండగకు ముందు మంగళవారం హుకుంపేటలో బాజాభజంత్రీల నడుమ అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందరూ చందాలు వేసుకుని మరీ భారీగా ఘటాలు ఊరేగించి, చదురుగుడి, వనంగుడికి వెళ్లి వాటికి ప్రత్యేక పూజలు చేస్తారు. బంటుపల్లి వెంకటరావు ఇంటి దగ్గరున్న చదురు వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో ఘటాలు ఉంచి మొక్కులు చెల్లిస్తారు.

ఎవరెవరు ఏం చేస్తారంటే..

పైడితల్లి సిరిమానోత్సవంలో ఎవరెవరూ ఏం చేయాలో ముందుగానే నిర్ణయిస్తారు. అంజలి రథం ఊరేగింపు కోసం ఆడవేషధారణలతో ఐదు కుటుంబాల వ్యక్తులు సిద్ధమవుతారు. వీరిలో నడిపేన, గురుబిల్లి, మీసాల తదితర కుటుంబాల వారు ఉంటారు. తెల్లఏనుగు ఊరేగింపులో గంటలు వాయిస్తూ 900 మంది ఏనుగు రథంతో వచ్చి పూజలు చేస్తారు. బెస్తవారి వల ఊరేగింపులో బెస్త వీధికి చెందిన 100 మంది జాలర్లు పసుపు రాసుకుని అమ్మవారి వెనుక నడుస్తారు. పాలధార ఊరేగింపులో సాకేటి వీధికి చెందిన వారంతా సాముగరిడీలు ప్రదర్శిస్తారు.

పండగ మరునాడు అన్నదానం..

సిరిమానోత్సవం మరుసటిరోజు హుకుంపేటలో పైడిమాంబ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహిస్తారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతూనే ఉంటుంది. గ్రామపెద్దల సహాయ సహకారాలు, దాతల విరాళాలతో అమ్మవారి పండగను అంగరంగ వైభవంగా చేపడతారు.

పైడితల్లి జాతరకు సర్వం సిద్ధం..

విజయనగరం టౌన్‌: పైడితల్లి జాతరకు సర్వం సిద్ధం చేస్తున్నారు. నెల రోజుల పాటు జరిపే ఉత్సవమైనా తొలేళ్లు, సిరిమానోత్సవాలే కీలకమైన ఘట్టాలుగా ప్రతీతి. ఏటా అంతకుముందు ఏడాది కన్నా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంటారు. ఇదే విషయమై దేవదాయ శాఖ సహాయ కమిషనర్‌ కునాదిరాజు శిరీష.. 3 నెలల క్రితమే అమ్మవారి దేవస్థానం ఇన్‌చార్జ్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణతో ముందుకువెళ్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ ఏడాది దేవదాయశాఖ మంత్రిగా ఉన్న ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఉత్సవాల ప్రత్యేకాధికారిగా చీఫ్‌ ఫెస్టివల్‌ ఆఫీసర్‌ ఎస్‌వీఎస్‌ఎన్‌ మూర్తి నియమితులయ్యారు. ఇదిలా ఉంటే తొలేళ్లు, సిరిమానోత్సవం రోజుల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త అయిన పూసపాటి అశోక్‌గజపతిరాజు కుటుంబీకులతో కలిసి ఉదయం 8:30 గంటల లోపు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఈ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చే సాధారణ భక్తుల దగ్గర నుంచి వీవీఐపీల వరకు అందరూ క్యూలైన్‌లో ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

ఇది ప్రతి ఒక్కరి పండగ..

పైడితల్లి పండగంటే ప్రతి ఒక్కరి పండగ..ఒకప్పుడు గ్రామదేవతగా ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితమై ఉన్న పండగ నేడు రాష్ట్ర పండగ చేస్తుండడం మనందరి అదృష్టం. జిల్లా వాసులంతా ఈ పండగలో పాల్గొని, తల్లిదీవెనలు పొందాలి.

–పతివాడ వెంకటరావు, హుకుంపేట

సంక్షిప్తంగా...

అనాథ శవానికి అంత్యక్రియలు



హైందవ సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహిస్తున్న ఖలీల్‌బాబు

విజయనగరం టౌన్‌: ఓ అనాథ శవానికి అంత్యక్రియలు నిర్వహించి, మానవత్వం చాటుకున్నారు బాబామెట్ట ఆశ్రమ నిర్వాహకులు ఖలీల్‌బాబు. ఐదేళ్ల క్రితం అశోక్‌నగర్‌ రహదారి పక్కన దిక్కుతోచని స్థితిలో పడి ఉన్న వృద్ధురాలిని చూసిన ఓ వ్యక్తి..ఖలీల్‌బాబుకు సమాచారమిచ్చారు. స్పందించిన ఆయన తన వృద్ధాశ్రమానికి ఆమెను తీసుకువెళ్లి సపర్యలు చేశారు. రాజులమ్మగా పిలువబడే ఆ వృద్ధురాలు దసరా రోజున కన్నుమూయగా కన్నీరుమున్నీరైన ఖలీల్‌బాబు తన కుమారుడు అహ్మద్‌బాబుతో కలిసి హైందవ సంప్రదాయ ప్రకారం అంత్యక్రియలు నిర్వహించారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

విజయనగరం: దసరా పురస్కరించుకుని, నగరంలో బాడీ ఫిట్‌నెస్‌ జిమ్‌ ఆధ్వర్యంలో జరిగిన బాడీ బిల్డింగ్‌ పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం బాడీ బిల్డింగ్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ దేశాభివృద్ధిలో యువత చాలా కీలకమని, అటువంటి యువత ఇప్పుడు ఫ్యాషన్‌ మాయలో పడి దురలవాట్లకు బానిసలై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి యువతి, యువకుడు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఆదర్శవంతమైన జీవితం గడపాలని కోరారు.

పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలి

భోగాపురం: పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలని ఎంపీపీ ఉప్పాడ అనూష రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీలకు ఏ విధంగా ఆదాయం సమకూర్చాలన్న అంశంపై సచివాలయ ఇంజినీర్‌, డిజిటల్‌ అసిస్టెంట్లు, సర్పంచ్‌లకు ఎంవోటీల ద్వారా ఇచ్చే శిక్షణను ఎంపీపీ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పంచాయతీలకు ఏయే మార్గాల ద్వారా ఆదాయం సమకూర్చవచ్చన్న విషయాలను ఈ శిక్షణలో వివరించడం జరుగుతుందని, తద్వారా పంచాయతీలకు ఆదాయం రాబట్టేందుకు కృషి చేయాలని కోరారు. అనంతరం ఎంపీడీవో స్వరూపరాణి.. కేంద్రం సవరించిన కొత్త జీఎస్టీ శ్లాబ్‌ల కారణంగా కలిగే ప్రయోజనాలను తెలిపారు.

విజయనగరం రూరల్‌: గ్రామపంచాయతీలు స్వయంసమృద్ధి సాధించి, ఆర్థికంగా బలోపేతం కావాలని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీల ఆదాయ మార్గాలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల అభివృద్ధికి అందించే నిధులతో పాటు పంచాయతీల్లో అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటే మరింత ఆదాయం సమకూరి గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంటా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

విజయనగరం ఫోర్ట్‌: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు మెనూ ప్రకారం భోజనం వండి పెట్టాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి టి.విమలరాణి సూచించారు. స్థానిక పట్టణంలోని సంజీవయ్య కాలనీ, బొగ్గులదిబ్బ కేంద్రం–2లను ఆమె శుక్రవారం తనిఖీ చేశారు. మెనూ పక్కాగా అమలు చేయాలని, ఏ రోజు వండాల్సిన వంటకాలు ఆ రోజే వండి పెట్టాలన్నారు. ప్రీస్కూల్‌ వీడియోలను షెడ్యూల్‌ ప్రకారం పిల్లలకు నేర్పిస్తూ గ్రూపులో పోస్ట్‌ చేయాలన్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కేంద్రాలు తెరిచి ఉంచాలన్నారు. విధుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పిల్లలకు దాత అందజేసిన యూనిఫాం పంపిణీ చేశారు.

జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోండి

పూసపాటిరేగ: కేంద్ర ప్రభుత్వం చేసిన జీఎస్టీ శ్లాబ్‌ల సవరణ కారణంగా ఏర్పడిన జీఎస్టీ తగ్గింపును సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వైఎస్‌ఆర్‌ నాయుడు కోరారు. స్థానిక మండల పరిషత్‌ కార్యాలయంలో జీఎస్టీ కొత్త శ్లాబ్‌లపై అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ముఖ్యంగా వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు, సామగ్రి తగ్గిన జీఎస్టీని తెలిపారు. వ్యవసాయానికి ఉపయోగించే ట్రాక్టర్లపై ఇదివరకు ఉన్న 12 శాతం జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం జరిగిందని, వాటి విడిభాగాల కొనుగోళ్లపై ఇదివరకు ఉన్న 18 శాతం జీఎస్టీని 5 శాతానికి, స్ప్రింక్లర్లపై ఉన్న 12 శాతం జీఎస్టీ 5 శాతానికి తగ్గించడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి కె.నీలిమ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న జిల్లా పౌరవేదిక సభ్యులు

విజయనగరం గంటస్తంభం: పైడితల్లి పండగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ నేతృత్వంలో పలువురు ఎస్పీ ఏఆర్‌ దామోదర్‌ను శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అమ్మవారి పండగకు లక్షలాది మంది భక్తులు తరలివస్తారని, సిరిమాను మూడు సార్లు తిరిగిన తర్వాత గుడి వద్ద తీవ్రమైన రద్దీ ఏర్పడి మహిళలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కరెంట్‌ సమస్యలు, ఒక్కసారిగా గేట్లు తెరవడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఎస్పీకి వివరించారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

నెల్లిమర్ల: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఆర్‌ఎస్‌ఎస్‌ ప్రాంత ప్రచారక్‌ ఆదిత్య కోరారు. స్థానిక కందర్ప కాలనీలోని శ్రీ సరస్వతి శిశు మందిర్‌లో విజయదశమి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్‌ వందేళ్లు పూర్తయిన సందర్భంగా దేశంలోని చిట్టచివరి గ్రామంలో కూడా హిందూ ధర్మ పరిరక్షణకు, ఇంటింటికీ సంఘ్‌ను పరిచయం చేయాలనే ఉద్దేశంతో శతాబ్ది కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మిమ్స్‌ వైద్య కళాశాల మెడికల్‌ డైరెక్టర్‌ రఘురాం తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

విజయనగరం టౌన్‌: జిల్లాలోని బ్రాహ్మణ నిరుద్యోగులకు అరుదైన అవకాశం లభించినట్లు ఆంధ్రప్రదేశ్‌ బ్రాహ్మణ సేవాసంఘ సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ శ్రీనివాస్‌ తెలిపారు. స్థానిక కొత్తఅగ్రహారంలోని కార్యాలయంలో సమాఖ్య ప్రతినిధులతో కలిసి ఆయన జాబ్‌మేళా కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుంటూరులో డిసెంబరు 13న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని, ఐటీ, నాన్‌ ఐటీ వంటి 50కి పైగా కంపెనీలు వస్తున్నాయని ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏఎన్‌ఎంల ధర్నా

విజయనగరం ఫోర్ట్‌: పదోన్నతులు కల్పించాలని డిమాండ్‌ చేస్తూ సచివాలయ ఏఎన్‌ఎంలు ధర్నాకు దిగారు. జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మిగతా జిల్లాల్లో ఏఎన్‌ఎం గ్రేడ్‌–3లకు ఎంపీహెచ్‌ఏ(ఫిమేల్‌)గా పదోన్నతి కల్పించారని, ఇక్కడ మాత్రం ఆ ప్రక్రియ పూర్తి చేయకుండా ఆరు నెలలుగా కాలయాపన చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్య పరిష్కరించేంత వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకుని కూర్చొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంల సంఘం నాయకులు మాధవి, శాంతి, సంతోషి, రత్నకుమారి, చాముండేశ్వరి, కాత్యాయని, శ్రీదేవి, శాంతి, భారతి, జ్యోతి, సీఐటీయూ నాయకులు టీవీ రమణ, జగన్‌మోహన్‌ తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటిని విక్రయిస్తే కఠిన చర్యలు

విజయనగరం: కలుషిత నీటిని విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్‌ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని ఆర్వో ప్లాంట్‌ల యజమానులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రతి ఆర్వో ప్లాంట్‌ నుంచి తీసుకువచ్చిన నీటి శాంపిల్స్‌ను విశాఖపట్నంలోని ల్యాబ్‌కు పంపనున్నామన్నారు. ప్రతి ఆర్వో ప్లాంట్‌ నిర్వాహకుడు..ప్లాంట్‌ శుద్ధి చేయకముందు..శుద్ధి చేసిన తర్వాత రెండు రకాల నీటి శాంపిల్స్‌ను తీసుకురావాలన్నారు.

అంధకారంలో కలెక్టరేట్‌

విజయనగరం అర్బన్‌: తుపాను కారణంగా గాలివాన బీభత్సానికి విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో కలెక్టరేట్‌లో గురువారం అంధకారం నెలకొంది. ఏ కార్యాలయం చూసినా చీకటిమయంగా దర్శనమిచ్చింది. గాలుల ధాటికి విద్యుత్‌ స్తంభాలు విరిగిపోవడంతో పాటు కొన్నిచోట్ల విద్యుత్‌ తీగలపై చెట్లకొమ్మలు పడిపోవడంతో కరెంట్‌ సరఫరా నిలిచిపోయింది. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లోని దాదాపు 35 ప్రభుత్వ శాఖల విధులు నిర్వహించలేని దుస్థితి నెలకొందని సిబ్బంది చెప్పారు.

పాత కార్మికులను కొనసాగించాలి

విజయనగరం గంటస్తంభం: నగరపాలక సంస్థ పరిధిలోని 37, 38, 48, 49, 56 సచివాలయాల్లో పనిచేస్తున్న పాత కార్మికులను యథావిధిగా కొనసాగించాలని ఏపీ మున్సిపల్‌ వర్కర్స్‌ అండ్‌ ఎంప్లాయీస్‌ ఫెడరేషన్‌ నాయకుడు ఎ.జగన్మోహనరావు డిమాండ్‌ చేశారు. ఇదే విషయమై నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. మున్సిపల్‌ పాలక వర్గం థర్డ్‌ పార్టీ విధానంలో తీసుకున్న 45 మందిని అవసరం మేరకు అన్ని సచివాలయాల్లో సర్దుబాటు చేయాలన్నారు.

ఈదురుగాలుల బీభత్సం



డెంకాడ: చొల్లంగిపేటలో తుపాను ప్రభావానికి గురైన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు



నెల్లిమర్ల రూరల్‌: తంగుడుబిల్లి రోడ్డులో కూలిన చెట్టును తొలగిస్తున్న గ్రామస్తులు



పూసపాటిరేగ: భూడి వీధిలో రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టు



విజయనగరం రూరల్‌: కొండకరకాంలో నేలకొరిగిన విద్యుత్‌స్తంభం



విజయనగరం రూరల్‌: విద్యుత్‌ స్తంభాల పునరుద్ధరణలో సిబ్బంది

తుపాను కారణంగా గాలివాన బీభత్సం సృష్టించింది. అల్పపీడన ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురవగా, ఈదురుగాలులు వీచాయి. గాలుల ధాటికి చెట్లు, విద్యుత్‌ స్తంభాలు నేలకూలాయి. దీంతో పలుచోట్ల ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల లోతట్టు ప్రాంతాలు వరద నీటితో నిండిపోగా మరికొన్ని చోట్ల పల్లపు ప్రాంతాల్లోని పంటపొలాలు నీటమునిగాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

–విజయనగరం రూరల్‌, నెల్లిమర్ల రూరల్‌, పూసపాటిరేగ, డెంకాడ